గొడ్డలి వేటుకు బలవుతున్న భారీ వృక్షాలు

విద్యుత్ లైన్లు పేరిట భారీ వృక్షాలు నరికివేత

విశాలాంధ్ర - కొమరాడ: ప్రజలకు నిత్యం విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్న విషయం మంచిదైనప్పటికీ కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంతో భారీ వృక్షాలు గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. కొమరాడ మండలంలోని సుమారు 25 కిలోమీటర్ల మేర అంతర్రాష్ట్ర రహదారి ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు కొత్తగా విద్యుత్ లైన్‌లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆయా కాంట్రాక్టర్లు విద్యుత్ పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ లైనులు చేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్‌కు సమయం, డబ్బు ఆదా చేసుకునేందుకు వారికి నచ్చినట్లు విద్యుత్ స్తంభాలు పాతడం, అవసరమైన చోట భారీ వృక్షాలను నరికివేస్తున్నారు. కొమరాడ మండల కేంద్రానికి అతి సమీపంలో కూనేరు వరకు అంతర్రాష్ట్ర రహదారి పక్కన భారీ వృక్షాలను ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ మిషన్లతో కట్ చేసి రోడ్డు పక్కనే ఇష్టానుసారంగా పడ వేస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణించే చిన్న వాహనదారులకు ఆ కర్రలు తగులుకొని ప్రమాదాలు బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల సమీపంలో రోడ్డుపై ఉన్న భారీ వృక్షాన్ని నరికి వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షాలను ఎటువంటి అటవీ శాఖ రెవిన్యూ శాఖ అనుమతులు లేకుండా తొలగింపుపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానుసారంగా నరికివేసి మొక్కలను నాశనం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఈ విషయంపై కొమరాడ అటవీ శాఖ సెక్షన్ అధికారి సత్యనారాయణని వివరణ కోరగా చెట్లు నరికేందుకు ఎటువంటి అనుమతులు తాము ఇవ్వలేదని చెప్పడం విశేషం.

కమిషనర్‌గా జయరాం

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా జయరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇతను పాలకొండ నగర పంచాయతీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కూడా కమిషనర్ గా ఇక్కడ పనిచేసిన అనుభవం కూడా ఉంది. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం విలేకరులతో మాట్లాడుతూ పాలకవర్గం ప్రజాప్రతినిధులు సిబ్బంది ప్రజలు సహాయ సహకారాలతో పాలకొండ నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వెల్లడించారు. జయరామ్‌కు చైర్ పర్సన్ పల్లా ప్రతాప్ రావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఐదవ వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు, 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కొడెం విజయకుమార్(బాబి), కో ఆప్షన్ సభ్యులు కైలాష్ షాహు, పార్టీ నాయకులు దావాల రమణారావు తదితరులు అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని గెద్దలుప్పి కూడలిలో ఉన్న కృషి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంగ్ల అక్షరాలు ఐడబ్ల్యూడి ఆకారంలో విద్యార్థులు విన్యూత ప్రదర్శనచేసి ప్రముఖ మహిళా చిత్రపటాలు చూపించి వారి ప్రత్యేకతను విద్యార్థులు తెలిపారు. పాఠశాల కరెస్పాండెంట్ ద్వారపురెడ్డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానం సాధించాలని విద్యార్థిదశ నుండి క్రమశిక్షణ కలిగి ఉన్న స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పి4 సర్వే ఖచ్చితంగా చేయాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్ పి4 సర్వేను పగడ్బందీగా చేయాలని ఎంపీడీఓ శంబంగి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యో గులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పేదరిక నిర్మూలన సమాజమే లక్ష్యంగా పి4 సర్వే జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యంగా పేదరికం లేని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమనేది ప్రభుత్వ పూర్తి ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగిన కుటుంబాలకు అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచే కార్యక్రమం పి4 అని ఆయన అన్నారు. ఇది విజయవంతం కావాలంటే మీరు చేస్తున్న సర్వేలే అత్యంత కీలకమని ఆయన సచివాలయ ఉద్యోగులను ఉద్దేశించి కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎంసిహెచ్ సత్య ప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పి 4 సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కొమరాడ: పి 4 సర్వే వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండలంలో 20 సచివాలయంలో

సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో మాట్లాడుతూ మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల ప్రకారం 20వ తేదీ వరకు పి 4 సర్వే వేగంగా పూర్తి చేయాలని, సర్వేలో ఎవరైనా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మత్రపు రాధాకృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారపుసంతలో సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: బలిజిపేట సంతలో తాగడానికి నీరు, షెడ్లు, రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు బద్దన భానుమూర్తి మాట్లాడుతూ వేలాది రూపాయలు సంత నిర్వహణకి ఆసీల రూపంలో వసూలు చేస్తున్నారని, సంతకి వచ్చినవారికి తాగడానికి మంచినీరు లేదని, సక్రమమైన రోడ్డు లేదని, షెడ్లు లేవని వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు యమ్మల మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

రావాడ రామభద్రపురంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ సుడిగాలి సందర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా రావాడ రామభద్రపురంలో గల ఒట్టిగడ్డ రిజర్వాయర్‌ను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించారు. రిజర్వాయర్ పరిధిలోని విస్తీర్ణం ఆయకట్టుకు అందుతున్న సాగినీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయితే 17 ఎకరాల ఆయకట్టు కుడి కాలువ ద్వారా 12 ఎకరాలు ఎడమ కాలువ క్రింద 5 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని జనవరిలో శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్ అప్పలనాయుడు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రోగులతో ముఖాముఖి మాట్లాడి ఎవరెవరు ఎక్కడి నుంచి వచ్చారు ఏ ఏ వ్యాధులతో బాధ పడుతున్నారని స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. దీనితో ఆయన స్పందించి స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సిహెచ్ శంకరరావును వీరికి మెరుగైన వైద్య చికిత్సను అందించాలని ఆదేశించారు. రావాడ రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన ముందుగా పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ రెడ్డి పకీరు, రెవిన్యూ ఇన్ స్పెక్టర్ గుణుపూరు సీతారామరాజు, రావాడ వట్టిగడ్డ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు యేగి రెడ్డి లక్ష్మునాయుడు (మోహన్), ఆసుపత్రి వైద్యాధికారి సిహెచ్ శంకరరావు, వైద్య సిబ్బంది, చినమేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ పి. అనీష్, సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పరిశ్రమతో ఉపాధి అవకాశాలు: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులోని మార్కెట్ గోదాంలో జీడి పరిశ్రమ స్థాపించేందుకు ఉన్న అనుకూలత, అవకాశాలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పరిశీలించారు. అధికారులతో కలసి జీడి పరిశ్రమ స్థాపనకు సాధ్యా సాధ్యాలను నిశితంగా పరిశీలించారు. బాయిలర్ ఏర్పాటు, ముడి సరుకు నిల్వ, యంత్రాల ఏర్పాటు, అవసరమైన వసతులు కల్పనకు జీడి పరిశ్రమ వ్యాపారులతో మాట్లాడారు. వాహనాల రవాణా సౌకర్యం, నీటి వసతి సదుపాయాలను అడిగితెలుసుకున్నారు. పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుందని వెల్లడించారు. వినూత్న ఆలోచనలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పిందెందుకు ముందుకు వచ్చిన ఔత్సాహికలను అనుమానతులను త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీవో మురళీధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సుధా రాణి, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, జిసిసి డిఎం మహేంద్ర కుమార్, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్, సైంటిస్ట్ కెవికె రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న దేవతామూర్తుల విగ్రహాలు

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, మరకతలింగ శివాలయాలలో ప్రతిష్టాపనకు కావలసిన దేవతామూర్తుల విగ్రహాలు మహాబలేశ్వరం నుండి మక్కువ మండల కేంద్రానికి శుక్రవారం చేరుకున్నాయి. దేవతామూర్తుల విగ్రహాలకు మజ్జి గౌరీ తల్లి గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల కోలాహాల నడుమ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొత్తం 23 విగ్రహాలను తీసుకురావడం జరిగింది. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు మావుడి రంగు నాయుడు, టిడిపి నాయకులు మావుడి ప్రసాదరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, లాడి ఫకీర్ రాజ్ భక్తులు పాల్గొన్నారు.

జీడి రైతుల సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వీరఘట్టం: జీడి మామిడి సాగు రైతుల జిల్లా సదస్సును ఈనెల 10వ తేదీన కురుపాం మండలం కే లేవిడి రబ్బర్ తోటలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వీరఘట్టం మండలం తూడి గ్రామంలో శుక్రవారం జీడి మామిడి పంట రైతులతో జరిగిన సమావేశంలో అప్పల నాయుడు మాట్లాడారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల తేనె మంచు తదితర అంశాలతో పంటకు జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కావలసిన రసాయనక ఎరువులను పిచికారి చేయటానికి యంత్ర పరికరాలను ఉచితంగా రైతులకు సరఫరా చేయాలని తదితర సమస్యలను సదస్సులో చర్చించనున్నట్టు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో చంద్రక కేశవరావు (సంఘం జిల్లా ఉపాధ్యక్షులు), బొత్స గౌర్నాయుడు (జిల్లా కోశాధికారి), మరియు చందక నారాయణరావు, జమ్ము చిన్నం నాయుడు, రావాడ దుర్గారావు, గడసాన ఇక్కయ్య, మొయ్యి ఉగాది, ఇరువాడ ఆనందరావు, తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఎం.రవణమ్మకు పీజీఆర్ఎస్, పీవోఎల్ఆర్, ఎంఎస్ఎంఈ సర్వే, మ్యుటేషన్ల పరిష్కారం, పీ 4 సర్వే నిర్వహణ తీరు అంశాలపై వివరాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వేలన్నీ కూడా త్వరతగతిగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల జోరు...

అడ్డుకట్ట వెయ్యని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - పాడేరు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేకంగా కల్పించిన 1/70 భూ బదలాయింపు చట్టాన్ని ధిక్కరించి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో ఓ గిరిజనేతరుడు అక్రమ కట్టడాల జోరు కొనసాగిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే పాడేరు మెయిన్ రోడ్డు అఖిల్ ఎంటర్‌ప్రైజెస్ పక్కన ప్రధాన రహదారికి ఆనుకొని ఓ గిరిజనేతరుడు శాశ్వత దుకాణాన్ని, శాశ్వత గృహం నిర్మించుకుంటున్నాడు. ప్రతిరోజు అదే మార్గంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు ప్రయాణం సాగిస్తారు. అయినా అధికారుల కంట పడకుండా జోరుగా నిర్మాణం కొనసాగిస్తున్నాడు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులు శాశ్వత గృహాలు నిర్మించకూడదని ఉన్నప్పటికీ అవేమీ పట్టకుండా జోరుగా జిల్లా కేంద్రంలో శాశ్వత గృహాల నిర్మాణాలు చేపట్టి గిరిజనేతరులే గృహాలు అద్దెకిచ్చి సొమ్ములు చేసుకుంటున్న పరిస్థితి జిల్లా కేంద్రంలో ఉంది. సంబంధిత రెవెన్యూ, పంచాయితీ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఇంటి పన్ను నుండి కరెంటు మీటర్ల వరకు గిరిజనేతరుల పేర్లతో ఇవ్వటం గిరిజన చట్టాలను తుంగలో తొక్కడమే అవుతుందని పలు ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలాగే జిల్లా కేంద్రంలో గిరిజనులే గిరిజనేతరులకు బినామీలుగా వ్యవహరిస్తూ అడ్డుకట్ట వేస్తున్న పరిస్థితి నేడు నెలకొంది. 1/70 చట్టాన్ని ఎవరు ధిక్కరించిన చట్టపరమైన నేరమని జాతీయ ఎస్టీ కమిషన్ చెప్పున్నప్పటికీ పాడేరు జిల్లా కేంద్రంలో మాత్రం చెలరేగిపోతూ గిరిజనేతరులకు గిరిజనులు బినామీలుగా వ్యవహరిస్తున్నారు. దీన్ని గుర్తించి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కూడా కాసులకు కక్కుర్తి పడి గిరిజన ప్రాంతం ఎలా పోతే మాకేంటి వారిచ్చే కాసులు మాకు అందుతున్నాయి కదా నెల అయ్యేసరికి మా జీతభత్యాలు మేము తీసుకుంటున్నాం కదా అనే ధోరణిలో అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ కట్టడాలపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్‌బీఐ బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలో గల కించమండ ఎస్‌బిఐ బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో కించుమండ గ్రామానికి చెందిన దుర్గమ్మ డ్వాక్రా సంఘ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. బ్యాంకు ఆవరణలో నిరసన వ్యక్తం చేసిన సభ్యులు పాడేరు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. 25 ఏళ్లుగా పొదుపు చేస్తున్నారు. 2009లో బ్రిడ్జిలోన్ ద్వారా రూ. 1లక్ష, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50వేలు సంఘ సభ్యులు రుణాన్ని పొందారు. పొదుపుతోపాటు తీసుకున్న రుణాన్ని దశల వారిగా చెల్లించేవారమని ఆ సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి అమ్మి, సీతమ్మ తెలిపారు. కరోనా, సమయంలో పొదుపు, రుణాన్ని కట్టలేక పోవడం జరిగిందన్నారు. టిడిపి హయంలో పసుపు కుంకుమ, వైకాపా హయంలో అసరా ద్వారా సంఘ సభ్యుల ఖాతాలో రూ. 2 లక్షలు మేర జమ అయ్యిందన్నారు. వెలుగు అధికారులతో తీర్మాణం చేయించి ప్రభుత్వాలు జమ చేసిన నగదును తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. బ్యాంకు అధికారులు తీసుకున్న రుణం ఉందని సమాధానం చెబుతూ ఏడాదిగా బ్యాంకు చుట్టూ తిప్పించుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే బ్యాంకు అధికారులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందని వారు తెలిపారు.

ఘనంగా 116వ అంతర్జాతీయ మహిళ దినోత్సవం

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయలో 116వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మహిళ దినోత్సవం పురస్కరించుకొని వి.వి జయ మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమైన రోజు మార్చి8వ తేదీ అని గుర్తు చేశారు. సమానత్వంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లో స్త్రీలు సమోన్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారన్నారు. స్త్రీ అంగటి సరుకుగా చూసే కార్పొరేట్ శక్తుల పెత్తనం మరోవైపు విజృంభిస్తోందన్నారు. మహిళలపై రోజురోజుకు హింస వేధింపులు పెరుగుతున్నాయన్నారు. మహిళను వ్యాపార వస్తువుగా చిత్రీకరించే సినిమాలను, వ్యాపార ప్రకటనలను నిషేధించాలన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా చూడకుండా వారికి రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో సమాన అవకాశాలు ఇచ్చి అభివృద్ధి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు ఐద్వా మండల సెక్రెటరీ కే.శశికళ, తులసమ్మ, చంప, సుందరమ్మ గిరిజన సంఘం నాయకులు కే.రామారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దారకొండలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ కేంద్రంలో మెగా ఉచిత కంటే వైద్య శిబిరంలో 270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు తెలిపారు. శుక్రవారం దారకొండ గ్రామ పంచాయతీ కేంద్రంలో పాడేరు ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు ఆదేశాల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, జీకేవీధి పోలీసు అధికారులు మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు గిరిజనులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దారకొండ, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డీకే హిమబిందు, మస్తాన్‌వల్లిలు సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డీకే హిమబిందు మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని 270 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి సీఐ వరప్రసాద్, సీలేరు ఎస్సై రవీంద్ర, శంకర్ ఫౌండేషన్ ఆప్తాల మిస్ట్ కే.రమేష్ బాబు, ఏంఎల్ హెచ్‌పిలు నాగమణి, లోవకుమారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

విశాలాంధ్ర - చింతపల్లి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు చింతపల్లిలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఈ ద్వితీయ సంవత్సరం పరీక్ష కు శుక్రవారం 466 మంది విద్యార్థులు హాజరైనట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీఆర్‌జెసి ప్రిన్సిపాల్‌లు కే గోవిందరావు, రామేశ్వరంలు తెలిపారు. ఈ మేరకు చింతపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు గాను 481 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 466 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని, 15 మంది గైర్హాజ రయ్యారని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు/చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 323 మంది విద్యార్థులకు గాను 314 మంది విద్యార్థులు హాజర య్యారని, 9 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని, ఏ పి గురుకుల కళాశాలలో 158 మంది విద్యార్థులకు గాను 152 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని 6 మంది విద్యార్థులు పరీ క్షలకు హాజరు కాలేదని వారు తెలిపారు.

కేజీబీవీలో కిశోర వికాసం

విశాలాంధ - దుంబ్రిగూడ: స్థానిక కస్తుర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యాన కిషోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినిలతో కౌమర దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రూపులుగా విభజించి అవగాహన కల్పించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. బాలికలకు కౌమర దశ అత్యంత కీలకమన్నారు. అనంతరం కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారిణి భావాని, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తులో లక్ష్యాలపై అవగాహన

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో జూనియర్ కళాశాలలో ఉండే కిశోర బాలబాలికల కిశోర వికాసం అనే కార్యక్రమం ద్వారా పిల్లల్ని తరగతి వారీగా వయసు వారిగా గ్రూప్‌లుగా చేసి వారిలో ఒక లీడర్‌ని ఎన్నుకొనేలా సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో విద్యా, ఆరోగ్యం, పోషణ, నైపుణ్యాల మీద ఆసక్తి పెరిగేలా వారికి వారే స్వశక్తితో ముందుకు వెళ్లేలా మార్గం సుగమం అవుతుందన్నారు. మహిళ సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వివో ఏ, నోడల్ టీచర్ వీరందరినీ కలిపి కమిటీగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీదేవి, సూపర్వైజర్లు, అంగ న్వాడి టీచర్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, పాఠశాలల సిబ్బంది, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట: విద్యార్థులు మంచి చదువులు చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని డా.వైఎస్ఆర్- టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ డా.తెడబారికి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అల్లంపుట్టు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నల పంపిణీ కార్యక్రమం ఆయన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిన్నతనం నుంచే చదువుపై దృష్టి పెడితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను మంచిగా రాసి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన కోరారు. పరీక్షలలో మంచి మార్కులతో ఉతీర్ణత సాధిస్తే వారికి రూ.10వేలు బహుమానంగా అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రదానోపాధ్యాయులు వేణుగోపాలరావు, సర్పంచ్ పెనుమల రంజిత్ కుమార్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల్లో విద్య, ఆరోగ్యం, పోషణ నైపుణ్యాలపై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యూరు: పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్య ఆరోగ్యం పోషణ నైపుణ్యాలపై ఆసక్తి పెంపొందించేలా

వారికి వారే స్వశక్తితో ముందుకు వెళ్లేలా గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.విజయ కుమారి, ఎంపీడీవో ఎస్‌కెవి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలో వివిధ ఆశ్రమ పాఠశాలలోనూ, జూనియర్ కళాశాల, కస్తూరిబా పాఠశాలలో ఉండే కిషోర్ బాలబాలికలకు కిషోర్ వికాసం అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులను తరగతి వారీగా వయసు వారిగా గ్రూపులుగా చేసి వారిలో ఒక మేటును ఎన్నుకునేలా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో ఐసీడీఎస్ పీవో జి.సువర్ణ కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ టీడీసీ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, అన్ని రంగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మండల అంగన్వాడి టీచర్స్ ప్రెసిడెంట్ జి.మోదకొండమ్మ అంగన్వాడి టీచర్స్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తుందని త్వరితగతిన సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, మాజీ ఎంపిటిసి కోట లక్ష్మణరావు, రాజు, సాగేని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరుణాకర్‌కి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఇటీవల ఒడిశా మన్యెంకొండ జాతరకు వెళ్లి తిరిగి వస్తున్న వి ఆర్ పురానికి చెందిన యువకుడు కొత్తూరు కరుణాకర్ కు యాక్సిడెంట్ అయి ఖమ్మం హాస్పిటల్లో జాయిన్ అయ్యాడు. అతనికిఆర్థిక సహాయం కోసం పాఠశాలకు వచ్చిన తన స్నేహితులకు జడ్పీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బాబూరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అందరూ కలిసి ఆపదలో ఉన్న బాధితులకు మానవత్వంతో వైద్య సేవ నిమిత్తం 6500 /రు ఆర్థిక సహాయాన్ని అందించారు. తన స్నేహితుడుకు వైద్య సేవలకు ఆర్థిక సాయం అందజేసినందుకు వారికి బాధితుని స్నేహితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికై పోరుకు సిద్ధం

విశాలాంధ్ర. వి. ఆర్. పురం: ప్రభుత్వాలు మారిన పోలవరం నిర్వాసితుల బ్రతుకులు మారే పరిస్థితి లేదని,నిర్వాసితుల సమస్యల పరిష్కారం కొరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, దానిలో భాగంగానే ఈనెల 11 నుంచి ప్రజా చైతన్య యాత్రలు గ్రామ గ్రామాన నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు కారం సుందరయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి పిఫ్ల దగ్గుతున్నా నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసే దిశగా ప్రభుత్వాలు పాలకులు ఆలోచించడం లేదని ప్రస్తుతం ప్రయారిటీ గ్రామాలలోని నిర్వాసితుల ను వారు మునుగుతారో,తేలుతారో అర్థం కాని పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. నిర్వాసితులతో ఆటలాడుకుంటున్నారే తప్పితే న్యాయం చేయాలనే దృక్పథంతో ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల పక్షాన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి,నిర్వాసితులకు న్యాయం జరిగేవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, మండల నాయకులు పొడియం శ్రీరామ్మూర్తి, వర్ధాది రమేష్, తోడం రాజు, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మిచిప్ప సత్యనారాయణ, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు, పులి బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 422 మంది గైర్హాజరు

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖఅధికారి మంజులవీణ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈపరీక్షలకు సంబంధించి జిల్లాలోసాధారణ కోర్సుల విద్యార్థులు 195మంది, వొకేషనల్ విద్యార్థులు 222మంది ఆబ్సెంట్ అయినట్లు తెలిపారు. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసాయన్నారు. 461 సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్ లు పర్యవేక్షణ చేశాయన్నారు. మాస్ కాపీయింగ్ జరగలేదని తెలిపారు. ఇదిలా ఉండగా సీతానగరం మండలంలోని జోగంపేట ప్రతిభ కళాశాల పరీక్షా కేంద్రంలో 155మంది విద్యార్థులు హాజరుకాగా ఆరుగురువిద్యార్థులు గైర్హాజరయినట్లు సిఎస్ కృష్ణారావు, డిఓ శాంతిలు తెలిపారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 254 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా పదిమంది గైర్హాజరయినట్లు సిఎస్ ప్రదీప్ కుమార్, డిఓ మహారాజులు తెలిపారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- విఆర్ పురం: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో జరుగబోయే సభ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. జనసేన పార్టీ వి.ఆర్.పురం మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా బొలిశెట్టి సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొని జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించడం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 14వ తేదీన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి అందరూ ఐక్యమై మన నాయకుడు పవన్ కళ్యాణ్ కు తోడుగా నిలవాలని అందరూ ఐక్యతతో పిఠాపురంలో జరగబోయే సభలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి,లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, వి ఆర్ పురం మండలం ఉపాధ్యక్షురాలు వాగులు ప్రమీల రాణి, కూనవరం మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర కుమార్,చింతూరు మండల అధ్యక్షులు మడివి రాజు, కూనవరం సర్పంచ్ మల్లపల్లి హేమంత్ గాంధీ, కూనవరం వైస్ ఎంపీపీ బందారు సాంబశివరావు, రాగల సురేష్, వి ఆర్ పురం మండల ప్రధాన కార్యదర్శి కొట్ల మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలువురు మహిళలకు సత్కారం

విశాలాంధ్ర - బెలగాం : స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో విశిష్ట సేవలందించిన పలువురు మహిళలకు తమ శాఖ తరపున సత్కరించినట్లు ఐసిడిఎస్ జిల్లా అధికారి టి. కనకదుర్గ తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్నాథపురం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా ఉత్తమ సేవలందిస్తున్న బెహారా శ్రీలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారిణి కనకదుర్గతో పాటు పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారులు వై. విమలకుమారి, కర్రి ప్రసాదరావు పాల్గొన్నారు. శ్రీలక్ష్మికి ఈ పురస్కారం లభించడం పట్ల జగన్నాథపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోజారాణి, సహోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అభినందనలు తెలియజేశారు.

మహిళా దినోత్సవ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బెలగాం : మహిళల సంఘటిత పోరాటాలకు హక్కుల సాధనకు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8వ తేదీ సంకేతంగా నిలుస్తూ స్ఫూర్తినిస్తుందని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు పి. కృష్ణవేణి అన్నారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ స్త్రీ విముక్తి సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్చి 8న స్థానిక ఎన్జీవో హోంలో ఉదయం 11 గంటలకు సభ జరుగుతుందని మహిళలంతా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వాలు, కార్పొరేట్ కంపెనీలు మహిళా పోరాట స్ఫూర్తిని అపహాస్యం చేస్తూ మార్చి 8ని ముగ్గుల పోటీలు, అందాల పోటీలు, వేడుకలు, సన్మానాల స్థాయికి దిగజార్చారని విమర్శించారు. వ్యవసాయ రంగంలో, వివిధ పరిశ్రమలలో షాపింగ్ మాల్స్ లో శ్రమ దోపిడీకి గురౌతున్న మహిళల హక్కులను, సమస్యలను చర్చించే సభలుగా మార్చి 8 కార్యక్రమాలు జరగాలని పితృస్వామ్య పీడన అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి,జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని మహిళామణులు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో వివిధశాఖల ఆధ్వర్యంలో గతవారంరోజులుండి వారోత్సవాలను కూడా నిర్వహించడం జరిగిందన్నారు.

గిరిజన భూముల అక్రమాలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: నియోజకవర్గంలో రూ.లక్ష రూపాయలు కూడా విలువ చేయని స్థలాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి 40 లక్షలకు విక్రయించి గిరిజనులు, దళితులకు లక్ష కూడా చెల్లించకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుక్రవారం అసెంబ్లీలో ప్రసంగించి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం పై సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి గిరిజనులు,దళితులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. పార్వతీపురం నియోజకవర్గంలోని టిడ్కో గృహాల రంగులు మార్పిడి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన మంత్రిని కోరారు. హరిజన, గిరిజనులు, దళితులు నివాసం ఉంటున్న స్థలాల్లోనే ఇండ్లు నిర్మించుకునేందుకు ఎల్పీసీల సమస్య ఉందని, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని అర్హులకు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. తెదేపా అధికారం కొనసాగించిన సమయంలో అమలు చేసిన ముఖ్యమంత్రి మోడల్ ఆరోగ్య కేంద్రాలను పునః ప్రారంభించాలని ఆయన కోరారు. పార్వతీపురంలో మలేరియా, టైఫాయిడ్, డయేరియా వ్యాధులు ప్రబలుతున్నాయని వీటివల్ల తక్కువ వయసులోనే గిరిజనులు మృత్యువాత పడుతున్నారని, వీటిని నిర్మూలనకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి వారి ఆరోగ్యం కాపాడే బాధ్యత తీసుకోవాలి అన్నారు. మా సొంత గ్రామమైన నర్సిపురం లో ఎక్కువమంది సింగిల్ పేరెంట్లు ఉన్నారని, వీరిలోఅవగాహన లేకపోవడం వల్ల చెడు అలవాట్ల వల్ల వ్యాధుల బారిన పడుతున్నారని, వీరిలో అవగాహన పెంచాలన్నారు.

అనారోగ్యంతో శరభన్నపాలెం ఎంపీటీసీ మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు: వైసీపీ సీనియర్ నాయకులు శరభన్నపాలెం ఎంపీటీసీ సభ్యులు లోకుల వెంకట సోమ గాంధీ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ లో మృతి చెందారు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన సోమ గాంధీ వైఎస్ఆర్సీపీ పార్టీ ఆవిర్భావం నుండి వైసీపీలోనే కొనసాగుతున్నారు. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అరకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి స్వగ్రామం అయిన శరభన్నపాలెం నుంచి ఎంపీటీసీగా భారీ మెజార్టీతో గెలుపొందారు. అయితే గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. వైద్య సేవల నిమిత్తం నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జాయిన్ చేశారు. అయితే అక్కడ డాక్టర్లు చూసిన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కింగ్ జార్జ్ హాస్పిటల్ లో కుటుంబ సభ్యులు జాయిన్ చేయించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం తెల్లవారుజాము సుమారు రెండు గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపీటీసీ సోమగాంధీ మృతి చెందడంతో మాజీ శాసనసభ్యులు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లిబాబులు, పార్టీ నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు, ఇతర రాజకీయ నాయకులు సోమ గాంధీ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

మహిళా హక్కులు కూడా మానవ హక్కులే: ఐద్వా

విశాలాంధ్ర - బెలగాం: మహిళలు చిన్నారులపై అకృత్యాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నిరోధానికి సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రామిక మహిళా, సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా సుందరయ్య భవనం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవనంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని భారత రాజ్యాంగం పేర్కొంటుందని, చట్టం ముందు అందరూ సమానులే భారత శిక్షాస్మృతి స్పష్టం చేస్తున్నప్పటికీ ఇవన్నీ కాగితాలకే పరిమితం కాస్తున్నాయని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు అన్ని విధాల రక్షణ కల్పించే బాధ్యత ఆయా సంస్థలతో, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు పరిశ్రమలు తదితరాల్లో పురుషులతో పాటు పనిచేస్తున్న శ్రామిక మహిళలకు రక్షణ కల్పించబడుతుందా లేదా అనేది పర్యవేక్షించాల్సిన ప్రభుత్వాలు ఈ విషయంపై ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి. ఇందిరా, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. జ్యోతి, మిడ్డే మీల్ జిల్లా నాయకులు వై. శాంతికుమారి, మహిళా సంఘం నాయకులు బి. లక్ష్మి, పి. వరహాలు, సిఐటియు నాయకులు బి. సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు కె. రాజు, ప్రజాసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు: మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బుస్టర్ పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ప్రతిరోజు త్రాగునీరు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్య మేరకు ప్రజలంతా సహకరించి ఇంటిలోని తడి చెత్తను పొడి చెత్తను రోడ్డుపైన కాలువలలోనూ విచ్చలవిడిగా పారవేయకుండా ఇంటి వద్దకే వచ్చే మున్సిపల్ చెత్తబుట్టలు అందచేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శ్రీనివాసరాజు ఉన్నారు. అనంతరం స్థానిక అన్న క్యాంటీన్లో పేదలకు అందుతున్న అల్పాహారం పనితీరును పరిశీలించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గంగవరం: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సిడిపిఓ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పిటిసి సభ్యురాలు బేబీ రత్నం మాట్లాడుతూ నేటి ప్రపంచంలో మహిళలు మగవారితో పాటు అన్ని రంగాలలో ముందున్నారని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం వారి సాధికారత కోసం ప్రభుత్వాలు ఇంకా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు విద్యారంగంలో ఇంకా పోటీ పడాల్సిన అవసరం ఉందన్నారు. బాల్యవివాహాల వల్ల జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆమె కోరారు. బాల్యవివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మంచి ఫలితాలు ఇస్తున్న గన్వాడీ కార్యకర్తలకు, అంగన్వాడీ హెల్పర్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా జడ్పీటీసీ బేబీ రత్నం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భవాని సిడీపీఓ లక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి లను ఘనంగా సన్మానించారు. అనంతరం ర్యాలీ చేయడం జరిగింది. బాల్యవివాహాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (2) టి మల్లేశ్వరావు, ఎంఈఓ కార్యాలయం పర్యవేక్షకులు సిద్దేశ్వర రావు, హెడ్ కానిస్టేబుల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల ఆమోదం లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన జేఏసీ రద్దు

విశాలాంధ్ర - పాడేరు: 1/ 70చట్టాన్ని ఉల్లంఘించిన రోళ్ళ శంకర్రావుపై చర్య తీసుకోవాలని ఆదివాసీ ప్రజాసంఘాలతో ఏర్పడిన జేఏసీని తక్షణమే రద్దు చేస్తున్నామని జేఏసీ మాజీ జిల్లా నాయకులు కాంగు చిన్ని, కూడ సుబ్రహ్మణ్యం కూడ రాధాకృష్ణ కిల్లో సురేంద్ర, పాలిక లక్కు తదితరులు ప్రకటించారు. పాడేరు లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రజా సంఘాల త్యాగాల ఫలితంగా ఏర్పడిన జేఏసీ నీ కొంతమంది వ్యక్తులు ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని, ప్రజా సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా జేఏసీని రిజిస్ట్రేషన్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏకపక్షంగా కార్యాచరణలు ప్రకటించడం, ఉద్యమాన్ని ద్రోహం చేయడం అవుతుందన్నారు. హక్కులు చట్టాలు పరిరక్షించడంలో జేఏసీ వైఫల్యం చెందింది. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమం నిర్మించడం కోసం, ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం మార్చి 12 తేదీన పాడేరులో అఖిలపక్ష ఆదివాసీ ప్రజా సంఘాలు నాయకులు ప్రతినిధులు సమావేశం నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి జేఏసీలో ఉన్న సంఘాల నాయకులు కూడా ఇన్వైట్ చేస్తామని తెలిపారు.

మహిళలకు బహుమతుల ప్రధానం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండల కేంద్రం దుంబ్రిగుడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నేరనిరోధ సంఘం ఆధ్వర్యాన గిరిజన మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన గిరి మహిళలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు క్రిష్ణకుమారి సేవలను అభినందిస్తూ శాలువను కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఎం.గీతా, ఆ సంఘం కో-ఆర్డినేటర్ రవీంద్ర, కృతివల్లవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే సహించం

విశాలాంధ్ర - బెలగాం : బోయ వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని కోరుతూ శుక్రవారం పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ (ఏజెఏసి) తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జెఏసి నాయకులు అన్నారు. ఈమేరకు వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే గిరిజన జాబితాలో ఉన్నటువంటి ఆదివాసులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందినటువంటి 45 లక్షల జనాభా ఉన్న బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన నిజమైన ఆదివాసులకు తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదం ఉందని దీనిపైన ఆదివాసి మంత్రివర్యులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గల మెత్తాలని కోరుతున్నామని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ (ఏజెఏసి) ఆధ్వర్యంలో తీవ్రమైన ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ , కోలక గౌరమ్మ పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతితో సర్వసభ్య సమావేశం వాయిదా

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో శరభన్నపాలెం ఎంపీటీసీ సభ్యులు లోకుల సోమగాంధీ మృతి చెందడంతో శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేయడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి ఎస్ కె వి ప్రసాద్ తెలిపారు. తిరిగి ఈ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 11న మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి వారానూకరాజు , ఎంపీపీ బడుగు రమేష్ 33 పంచాయితీల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులతోపాటు మండల స్థాయి అధికారులు తమ పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని ఆయన తెలిపారు. హాజరుకాని అధికారుల వివరాలను జిల్లా కలెక్టర్కు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా పూజలందుకున్న సకల దేవతలు

విశాలాంధ్ర - చింతపల్లి: ఆలయ పదహారవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రామాలయం వీధిలో ఉన్న సకల దేవతలకు భక్తులు ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ16వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు (ఆలయ కమిటీ సభ్యులు) తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోకాడ సత్యనారాయణ, వర్తక సంఘం కార్యదర్శి పెదిరెడ్ల జేతాబుడు తోపాటు వసుపలేటి వినాయకరావు, ఉప్పల బంగారయ్య శెట్టి (రమేష్), ఎన్ ఈశ్వరరావు, దూనబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఉదయ్, పాపయ్య

విశాలాంధ్ర - దేవీపట్నం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ, ప్రజా సమస్యలను పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తూ, మరింత అభివృద్ధి పథంలో ప్రెస్ క్లబ్ని తీసుకు వెళతానని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉదయ్ అన్నారు. శుక్రవారం దేవీపట్నం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ద్వారా చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి చర్చించారు. అనంతరం కొత్త ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పదవులకు సంబంధించి సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యులంతా వీరందరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దేవీపట్నం ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన టి.ఉదయ్, వైస్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కొల్లి పాపయ్య, సెక్రటరీగా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికైనారని దేవీపట్నం ప్రెస్ క్లబ్ తరఫున సభ్యులందరూ తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రెస్ క్లబ్ నియమ నిబంధనలకు లోబడి ఉండాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పని చేయాలని నూతన అధ్యక్షుడు ఉదయ్ సూచించారు.

మహిళా దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం లక్ష్మీదేవి పేట పాఠశాల ఆవరణలో సమావేశం మహిళ అధ్యక్షురాలు ఎస్.గంగాభవాని అధ్యక్షతలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎటపాక మండలం కేంద్రంలో మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అంగన్వాడీ కార్యకర్తలు, సదివాయ మహిళా సిబ్బంది ,వెలుగు మహిళా సిబ్బంది ,వెలుగు మహిళలు ప్రజా ప్రతినిధులు, మహిళా మణులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, పుల్లమ్మ పాయల, తులసి తుర్రం, రజిని శీలం విజయ కుమారి, గొండి రాధ, పొడియం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ: 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శనివారం 8, మార్చి 2025

జిల్లా వెలుగు పీడీని కలిసిన వెలుగు అధికారులు

విశాలాంధ్ర - సీతానగరం: జిల్లా వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన సుధారాణిని సీతానగరం మండలం అధికారులు శుక్రవారంనాడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములునాయుడు, సిసిలు కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో వెలుగుద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంతోపాటు సీసీలు వసంత్ కుమార్, సత్యంనాయుడు,అనందరావు ,మోహన్, ప్రసాదరావులు పాల్గొన్నారు.

పి 4 సర్వేను పటిష్టంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - మక్కువ: మక్కువ మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణాంధ్ర సర్వేను ఫేజ్ 4 వేగవంతం చేయాలని సర్వేలో నేటి నుంచి 13 వ తారీకు నాటికి సమగ్ర సర్వే పూర్తి చేయాలని మక్కువ మండల స్పెషల్ ఆఫీసర్ పి తిరుపతయ్య అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషర్స్ మండలంలో గల సచివాలయ ఉద్యోగులందరికి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమము, స్థానిక ఎంపిడిఓ , డిడి స్వరూప రాణి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫేజ్ 4 సర్వేను త్వరగా త నేటి నుంచి పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలోవారు పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు టార్పలిన్లు పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అందజేస్తున్న టార్పలిన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జీసీసీ బ్రాంచ్ మేనేజర్ ఎన్.కొండబాబు కోరారు. శుక్రవారం చిన్నబంధవీధి డీఆర్ డిపో పరిధిలో అరగడపల్లి, కోరాపల్లి, నేరోడివలస గ్రామాల కాఫీ రైతులకు టార్పలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎం కొండబాబు మాట్లాడుతూ ఈ ఏడాది కాఫీ దిగుబడులు వందకు పైగ కిలోలు కాఫీలు పండించిన కాఫీ రైతులకు ఉచితంగా టార్పలిన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాఫీ రైతులకు మరిన్ని సౌకర్యాలు అందజేసి రైతులకు ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నబంధవీధి సేల్స్‌మెన్ గందేరు నిరీక్షణరావు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారాకు వ్యతిరేకంగా కళాజాత

విశాలాంధ్ర - జి.మాడుగుల: పెదలోచలి పంచాయతీ బొర్రాతాడే గ్రామాల్లో నాటు సారా క్రయ విక్రయాలపై కలుగు నష్టాలపై పాడేరు ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ టీవీఎస్ఎన్ ఆచారి ఆధ్వర్యంలో నాటు సారాకు వ్యతిరేకంగా కళజాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ 0-20 కార్యక్రమం ద్వారా గిరిజనులకు కళజాతర ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ కార్యక్రమానికి అందరు సహకారించాలని కోరారు. నాటు సారా అమ్మిన. తయారు చేసిన చట్టరిత్యా నేరమని వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్ర మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

డి.వి.ఈ.ఓ మంజుల వీణకు ఉత్తమ మహిళా అవార్డు

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని మహిళ అధికారులకు, ప్రిన్సిపాల్ కు, మహిళా అధ్యాపకులకు, విద్యార్థినీలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి మంజుల వీణ తెలిపారు. ఆమెకు అబ్దుల్ కలాం స్వచ్ఛంద సంస్థ ఉత్తమ మహిళ-2024 అవార్డును అందజేయడంతో దానిని జిల్లా కలెక్టర్ చేతులమీదుగా తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నో అవార్డులు తీసుకోవడం ఆనందంగా ఉందని, తనబాధ్యత పెరుగుతుందన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా మహిళలకు పెద్దఎత్తున ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలను రూపకల్పన చేస్తున్నారని తెలిపారు.

విద్యాలయాల్లో కిశోర వికాసం

విశాలాంధ్ర - గంగవరం: మేరకు ప్రతి నెల మొదటి రెండవ మూడవ శుక్రవారం లో గవర్నమెంట్ స్కూల్స్ కాలేజెస్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్ జడ్పీహెచ్ఎస్ ఉన్న కిషోరి బాల బాలికలు ఉన్న ప్రదేశాల్లో కిషోర్ వికాసం అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సిడిపిఓ సిహెచ్ లక్ష్మి తెలిపారు. దీనిలో భాగంగా గంగవరం ఆశ్రమం స్కూల్ నందు టీమ్ మెంబర్స్ అయినా మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్ మోడల్ స్కూల్ టీచర్ సైన్స్ టీచర్ ఆశ కార్యకర్త వీరి ఆధ్వర్యంలో కిషోరీ వికాసం కార్యక్రమము 6 నుండి 9 తరగతి పిల్లలకు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమఇంలో సూపర్వైజర్ టి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెం ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గంగవరం: భూపతి పాలెం ప్రాజెక్టు నుండి సూరంపాలెం ప్రాజెక్టుకు అనుసంధాన నీటి కాలువ మార్గాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. గోకవరం మండలంలో సూరంపాలెం ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు నీటి ఎద్దడితో కటకటలాడుతున్నాయి. ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయానికి నీరు అందకపోవడంతో రైతాంగమంతా ఆవేదనకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నటువంటి ప్రాజెక్టులను ఆయన పరిశీలించడం జరిగింది.గంగవరం , రంపచోడవరం ఏజెన్సీ మండలాల్లో ఆయన పర్యటించారు. కారు గాని, ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని, నడవడానికి కూడా ఇబ్బందిగా ఉండే కాలవ మార్గాలను సైతం లెక్కచేయకుండా నీరు వచ్చే కాలువ మార్గాలను,వాటికున్న అడ్డంకులను ఆయన పరిశీలించారు. సూరంపాలెం రిజర్వాయర్ కు నీటిని రప్పించే సాధ్యాసాధ్యాలపై ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, టిడిపి అధికార ప్రతినిధి ఎస్ఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య బోర్డు మెంబర్ కొత్తా కొండబాబు, రాష్ట్రస్థాయి టిడిపి నాయకులు, జిల్లాస్థాయి, నియోజవర్గ, మండల స్థాయి టిడిపి, జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలపట్ల గౌరవంతో మెలగాలి: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : సమాజ, కుటుంబ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే మహిళలపట్ల ప్రతి ఒక్కరూ గౌరవంతో మెలగాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2కె రన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా, ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని 2కె రన్ కు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయంనుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారాన్ని ఏర్పాటుచేసి అధికారులు, విద్యార్థులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరు మహిళలు ఆత్మగౌరవంతో స్వశక్తితో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకుని స్త్రీ శక్తి అంటే ఏంటో ప్రపంచానికి తెలియజేస్తున్నారన్నారు. మహిళలు ఏ రంగంలోనూ పురుషుల కంటే తక్కువ కాదని, వారిని వారు ప్రతి క్షణం నిరూపించుకుంటున్నారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, నటన, టెక్నాలజీ, బ్యాంకింగ్, హెల్త్ కేర్, అంతరిక్షం, ఇంటి బాధ్యతలతో సహా పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ, మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. రంగం ఏదైనా, ఎంత కష్టమైనా ఉన్నత శిఖరాలను చేరుకొని పురుషులకు తామేమీ తీసిపోమని తెలియ జేస్తున్నారని కితాబిచ్చారు. అటువంటి మహిళలను అందరూ గౌరవించుకోవాలని, అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలని, శనివారం జరగబోయే మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఐటిడిఏ ప్రోజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారి డా.టి.కనకదుర్గ, జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎస్.తిరుపతినాయుడు, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. టి.జగన్మోహనరావు, ఇతర జిల్లా అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని 16 బీసీ వసతిగృహాలో ఈ నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా బిసి సంక్షేమ అధికారి కృష్ణ తెలిపారు. 16 వసతి గృహాల్లో 7గురు రెగ్యులర్, మిగిలినవాటికి ఇంచార్జి వసతి గృహ సంక్షేమ అధికారులతో నిర్వహిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ తెలిపారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో గల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిసి 16 వసతి గృహాలున్నాయన్నారు. వాటిలో 7 గురు వసతి గృహ సంక్షేమ అధికారులు రెగ్యులర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. మిగిలిన వసతి గృహాలకు దగ్గరలోగల వసతి సంక్షేమ అధికారులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈవసతి గృహాలలో వసతి గృహ సంక్షేమ అధికారుల ఖాళీల పూరించుటకు గాను గతంలో సంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ వారికి మరియు పూర్వపు జిల్లా నోడల్ అధికారులైన అయిన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి, విజయనగరం వారికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అలాగే బీసీ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు, మరమ్మత్తులకు గాను రూ. 2 కోట్ల 47 లక్షల 50 వేల అంచనాతో ఉన్నత అధికారులకు పంపామన్నారు.అందులో 11వసతి గృహాల్లోని అత్యవసర మరమ్మతులు కొరకు 21 లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిని ఏపీఈడబ్ల్యుఐడిసికి పనులు చేయుటకు అప్పగించడమైదన్నారు. అన్ని వసతి గృహాల్లో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ప్రణాళిక బద్ధంగా చదివించడం జరుగుతుందన్నారు. శత శాతం ఫలితాలు సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సూచనలతో వసతి గృహాల్లో మంచి ఫలితాలు సాధించేందుకు వసతి గృహ సంక్షేమఅధికారులు, ట్యూటర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. వెనుకబడిన విద్యార్థులపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

మెగా డీఎస్సీతో పాటు ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

విశాలాంధ్ర - పాడేరు: మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి స్థానిక ఆదివాసిలకు నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనరస రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.పాడేరు ఐటిడిఏ ఎదురుగా ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఆదివాసి ఆత్మగౌరవ దీక్ష ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని, ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో స్థానిక ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేసి నేటికీ సుమారు ఏడాది కావస్తున్న నేటికీ పునర్ధరణ చేయకపోవడంతో స్థానిక ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రమైన ఆందోళన గురి అవుతున్నారాని ,కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు భర్తీలో నాన్ షెడ్యూల్ వారు ఉపాధి పొందుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, గత ప్రభుత్వం గిరిజన సలహా మండల్లో తీర్మానం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిం చిందన్నారు. నేటికీ పునరుద్ధరణ కోసం పాలకవర్గాలు ఎటువంటి ప్రయత్నం చేయకపోవడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ అధ్యక్షత వహించగా గర్జన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర జిల్లా కార్యదర్శి పొద్దు బాలుదు దండకరణ ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యులు సోమిరెడ్డి మాణిక్యం గంప ధనుర్ జై ఆదివాసి మహిళా సంఘం నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీవన కృష్ణ కార్తీక్ ఆదివాసీ సేన జిల్లా కన్వీనర్ రాజబాబు, వైసిపి మహిళ నాయకులు కురుస పర్వతమ్మ కూడా సుబ్రహ్మణ్యం, మహిళా సంఘం నేతలు హైమావతి, విమల, ప్రభ, శ్రీలత, కీర్తన, చిన్ని, ఏఐఎస్ఎఫ్ నేత రాజశేఖర్, కృష్ణ, డివిఎఓ నాయకులు గంగా, కుమారి,కాంతారావు , పీ లక్కు, ఎంపీపీ ఉమా మహేష్, సూర్య కళ ఎంపిటిసి రామారావు, అరుణ, జి రాజశేఖర్, భాను కాంగ్రెస్, వై కుమార్, కొమ్మ బాలరాజు వైసీపీ నేత ,తదితరులు పాల్గొన్నారు.

సిర్లిజాతరకు పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రంలోని దేవరవీధిలో శుక్రవారం జరిగిన సిర్లిపోతన్న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కిటకిటలాడింది. ఉదయం నుండి రాత్రివరకు జాతర కొనసాగింది. కమిటీసభ్యులు అన్ని ఏర్పాట్లుచేశారు. క్యూలోనిలబడి భక్తులు దర్శనాలు చేసుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులు చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిదంపతులుతోపాటు సీతానగరం ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. సిర్లిఎల్లమ్మ తల్లిజాతరకు సీతానగరం, చినబోగిలి పెదభోగిలి బుడ్డిపేట, లక్ష్మీపురం, బూర్జ తదితర గ్రామాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. గుడ్లు, ఉలవలు, బియ్యము, కొబ్బరికాయ, అరటిపళ్ళు తదితర పూజాసామాగ్రితో దర్శనం చేసుకోవడంవలన చర్మవ్యాధులు దరిచేరవని భక్తులు తెలిపారు. వివిధ గ్రామాలనుండి భక్తులతోపాటు యువతీ యువకులు, విద్యార్థిని విద్యార్థులు,చిన్నారులు పెద్దఎత్తున తరలిరావడంతో సీతానగరం కిటకిట లాడింది. జాతరలో బొమ్మలు, స్వీట్లు, ప్రసాదాలు, వివిధ రకాల సామానులు కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపించారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై రాజేష్ ఏ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. ఎల్ వి ఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్యాకెట్లు, మజ్జిగ, పంపిణీ చేసినట్లు తెలిపారు. సీతానగరం మార్కెట్లో కూడా పలువురు వ్యాపారస్తులు పులిహోర మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీతానగరంతో పాటు అంటిపేటలోకూడా జాతర జరిగింది.

డిజిటల్ అసిస్టెంట్‌లు అప్లోడ్ సమయంలో జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలో పంచాయితీల ద్వారా అందించే కుల,ఆదాయ,కుంటుంబ సభ్యుల ధృవపత్రాల అన్ లైన్ నమోదులో తప్పులు లేకుండా డిజిటల్ అసిస్టెంట్‌లు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ఆన్ లైన్ చెయ్యాలని మండల తహశీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. శుక్రవారం రింతాడ గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు.కొన్ని రోజులుగా ఆన్లైన్ చేయకుండా వదిలేసిన కుటుంబ సభ్యుల ధృవ పత్రాల కోసం పెట్టుకున్న దరఖాస్తులను చూసి సిబ్బందిపై ఆగ్రహించారు. ధ్రువపత్రాల కోసం వచ్చే అర్జీదారులను గ్రామ సచివాలయంలో చుట్టూ తిప్పించుకోకుండా వెంటనే దరఖాస్తులు ఆన్లైన్ చేయాలని హెచ్చరించారు.కుల,ఆదయ, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాల నమోదు, మ్యుటేషన్ చేసేటప్పుడు ఇంటిపేరు, కులం, ఉప కులం, భూమి సర్వే నంబరు, ఉప సర్వే నెంబరు, భూమి విస్తీర్ణం వంటి వివరాలు నమోదు చేసేటప్పుడు తప్పిదాలు జరగకుండా జాగ్రత్త పాటించాలన్నారు. రెవెన్యూ సేవలపై సచివాల సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు,గ్రామ సచివాలయంలో అందించే రెవెన్యూ సేవలలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డిడిఓ అరుణ కుమార్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూనవరం: ఈనెల 11వ తేదీ నుంచి కూనవరం మండలంలో జరిగే పోలవరం ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య కోరారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో తెల్లం తమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంటూర్ లెవెల్ పేరుతో సర్వేల పేరుతో ఫస్ట్ లిస్టు సెకండ్ లిస్టు అని నిర్వాసితులను గందరగోళానికి గురి చేయకుండా ముంపుకి గురయ్యే ప్రతి గ్రామాన్ని ప్రతి కుటుంబాన్ని లబ్ధిదారుల జాబితాలో చేర్చి పరిహారం ఇవ్వాలని ప్రధాన డిమాండ్తో జరగబోయే ఈ చైతన్య యాత్రను నిర్వాసితులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మడకం నాగమణి, తాళ్లూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం ప్రాణం తీసింది

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మితిమీరిన వేగంతో మోటార్ సైకిల్ నడపడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. జియ్యమ్మవలస పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ఎస్ఐ పి.అనిష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అలమండ పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి నాగేశ్వరరావు (46) గురువారం రాత్రి నీలకంఠాపురం గ్రామం నుండి ఆ గ్రామానికి చెందిన నిమ్మక శంకరరావు గ్లామర్ మోటార్ సైకిల్‌పై పాలక లాలిబాబులతో కలసి గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడి గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవత పండగకు బయలుదేరారు. కాగా శంకరరావు మితిమీరిన వేగంతో బైకును నడపడంతో బైకు బోల్తా పడిన ఘటనలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారంవేకువ జామున మృతి చెందాడు. నాగేశ్వరరావు మృతికి ముఖ్య కారణం శంకరరావు మితిమీరిన వేగంతో బండి నడపడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని మృతుని సోదరుని కుమారుడు కొండగొర్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానసిక శారీరక అంశాలపై అవగాహన కలిగి ఉండండి



విశాలాంధ్ర - చింతపల్లి: కిశోర బాలబాలికలు మానసిక, శారీరక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారులు పనసల ప్రసాద్, జి బోడం నాయుడులు అన్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐ సి డి ఎస్ సి డి పి ఓ జి వెంకటరమణ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో బృందాలుగా విభజించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు, సీఆర్పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంరక్షణ అధికారినిలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



విశాలాంధ్ర - కూనవరం: బాల్య వివాహాలను అరికట్టడంలో గ్రామస్తుల సహకారం అవసరమని తల్లిదండ్రులు ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలని చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లెల్లగూడెం లోని అంగన్వాడీ కేంద్రంలో ఈ అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని మానసికంగా శారీరకంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అందరు సహకారంతో ఈ దురాచారాలు అరికట్టాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో పంచాయతీ సెక్రటరీ శివ మణికంఠ మహిళా పోలీస్ రమ్య, ఏఎన్ఎం దుర్గ పాఠశాల ఉపాధ్యాయుడు సతీష్ అంగన్వాడి టీచర్లు వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల క్షేత్రస్థాయి పరిశీలన



విశాలాంధ్ర - దేవీపట్నం: దేవీపట్నం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం సంభందించి గ్రామాలలో జరుగుతున్న వివిధ పనులపై క్షేత్ర స్థాయి పనులను పరిశీలించి తదుపరి మన శ్రీ శక్తి భవనం నందు సిబ్బంది అందరితో సమీక్షా సమావేశం నిర్వహించి ఉన్నారు ఈ కార్యక్రమం నందు దేవీపట్నం మండలం గౌరవ ఎంపీడీవో అలాగే ఉపాధి హామీ ఎపిఓ లక్ష్మీనారాయణ జై వీర్రాజు తదుపరి సాంకేతిక నాయకులు క్షేత్ర సహాయకులు అందరి సమక్షంలో దేవీపట్నం మండలం పై ఉపాధి హామీ ప్రగతిపై సమీక్ష నిర్వహించి జిల్లాస్థాయి అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని ఏ పి ఓ పేర్కొన్నారు. ఇదే విధంగా వచ్చే నెల ఏప్రిల్ మొదటి నుండి మొదలు అవ్వి తర్వాత ఆర్థిక సంవత్సరం నందు కూడా ఇదే ప్రగతిని చూపించమని అలాగే అన్ని పనులను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి ప్రగతి పథంలో దేవిపట్నం ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతు పొలముల నందు మనం చేయుచున్న చిన్న నీటి కుంటలను ఎక్కువగా మంజూరు చేసి వాటిని పూర్తి చేయవలసిందిగా ఆదేశించి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఓ లక్ష్మి నారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జోగంపేట సర్పంచ్ చెక్ పవర్ రద్దు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగంపేట సర్పంచ్ కళ్యంపూడి సింహాచలం చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలలపాటు పంచాయతీ సర్పంచ్ పవర్ రద్దు కావడంతో ప్రత్యమ్నయంగా పరిపాలన అధికారి ప్రసాద్ ను జోగంపేట ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ పంచాయతీపై పలు ఆరోపణలు రావడంతో విచారణచేసినఅధికారులు సర్పంచ్ చెక్ పవర్ ను రద్దు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

బూర్జలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర – సీతానగరం: శాసనసభ్యులు బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఎన్నడూ లేనివిధంగా బూర్జగ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గ్రామ నాయకులు తెలిపారు. సిసి రోడ్ల నిర్మాణాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణం తదితర పనులు చేయడం జరిగిందన్నారు.గ్రామంలో ప్రధానసమస్యయినా మంచినీటి కుళాయిలు మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. గ్రామంలో అభివృద్ధి సంక్షేమానికి ఎమ్మెల్యే పెద్దపేట వేస్తున్నట్లు టిడిపినాయకులు బలరాం నాయుడు, నీరస జ్యోతి చంద్రశేఖర్ తదితరులు తెలిపారు.

మహిళలు... మహారాణులు

అన్ని రంగాలలో రాణిస్తున్న అతివలు

వివిధ రంగాలలో ప్రతిభావంతులుగా రాణిస్తున్న మహిళలపై అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక కథనం.

విశాలాంధ్ర – చింతపల్లి: ప్రస్తుత సమాజంలో మగవారికి దీటుగా మహిళలు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారు. మహిళలూ... మహారాణులు అనే సూక్తికి ఏమాత్రం తీసుపోని విధంగా మహిళలు నేడు అన్ని రంగాలలో ముందుంటున్నారు. చింతపల్లి మండలానికి సంబంధించి రక్షణ రంగం నుంచి రాజకీయ రంగం వరకు, అదే క్రమంలో విద్యారంగం నుంచి వైద్యరంగం వరకు, ఉద్యాన శాస్త్రవేత్తల నుంచి బాల్య వివాహాల నిర్మూలన, బాల బాలికలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందచేసే ప్రక్రియ వరకు మహిళలు తమ ప్రతిభను కనబరిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. వీరిలో రక్షణ రంగం నుంచి సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి వినీత, రాజకీయ రంగం నుంచి స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, విద్యారంగం నుంచి స్థానిక ఏ టి డబ్ల్యూ ఓ బలిరెడ్డి నాగ జయలక్ష్మి, ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెండెంట్ గా ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించిన ఇందిర ప్రియాంక, ఉద్యాన అధికారి నుంచి ఉద్యాన అధిపతి గా చెట్టి బిందు, అదేవిధంగా బాల్యవివాహాల నిర్మూలనకు, బాల బాలికలు, గర్భిణీలు, బాలింతల సంరక్షణకు పాటుపడుతున్న ఐ సి డి ఎస్ సి డి పి ఓ గుబ్బల వెంకటరమణ యొక్క ప్రస్థానం చింతలపల్లి నుంచి అంచలంచలుగా పదోన్నతులు పొందుతూ చింతపల్లి మండలంలో అనేక సేవలు అందిస్తున్నారు.

ఈ విధంగా ఎంతో మంది మహిళలు తాము ఎంచుకున్న రంగాలలో రాణిస్తూ మహిళా చైతన్యాన్ని ముందుకు తీసుకువెళు న్నారు. అటువంటి వారందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని "విశాలాంధ్ర" ప్రత్యేక అభినందనలు తెలియపరుచుకుంటుంది.

రక్షణ రంగంలోనూ మగవారికి దీటుగా మహిళలు రాణిస్తున్నారు. పోలీసు వ్యవస్థలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్గా డివినీత ధైర్య సాహసాలను ప్రదర్శిస్తున్నారు. అసిస్టెంట్ కమాండెంట్ స్థాయిలో సేవలందిస్తున్న ఆమె మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు.

కోరాబు అంగద రావు సుజాతల గారాలపట్టి అనూష దేవి, నేడు చింతపల్లి ఎంపీపీగా రాజకీయ రంగంలో రాణిస్తున్నారు. అవివాహిత అయిన అనూష దేవి తాజంగి ఎంపీటీసీగా రాజకీయ అరంగేట్రం చేసి తొలి ప్రయత్నం లోనే ఎంపీటీసీగా విజయం సాధించి అనూహ్యంగా ఎంపీపీ పగ్గాలు అందుకని ఎంపీపీ కావాలన్న తన తండ్రి కలను సాకారం చేయడంతో పాటు మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు.

గతంలో పాడేరు శాసన సభ్యురాలుగా సేవలందించిన కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, ప్రజా పోరాటాలలో ముందుంటూ ప్రతిపక్ష వైసీపీ నాయకురాలుగా తనదైన ప్రత్యేక ముద్ర వేసుకొని రాజకీయరంగంలో రాణిస్తున్నారు.

విద్యారంగంలో రాణించి నేడు చింతపల్లి, జికే విధి, జీ మాడుగుల మండలాలకు సంబంధించి ఏ టి డబ్ల్యూ ఓ గా బలిరెడ్డి నాగ జయలక్ష్మి విశేష సేవలు అందిస్తున్నారు

ఉద్యాన శాస్త్రవేత్తగా నియమితులైన చెట్టి బిందు అంచెలంచెలుగా తన ప్రతిభకు పదును పెడుతూ చింతపల్లిలో ఉద్యాన అధిపతిగా సేవలు అందిస్తున్నారు.

కత్తి మీద స్వాము లాంటి వైద్యరంగంలోనూ మహిళలు ముందుంటున్నారు. స్థానిక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిలో సూపరిండెండెంట్ గా డాక్టర్ ఇందిరా ప్రియాంక నియమితులై ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారు.

మన్యప్రాంత విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయాలనే తపనతో విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తపన పడుతున్న మహిళ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి.

తూర్పుగోదావరి జిల్లా చింతలపల్లి లో పుట్టి పెరిగిన గుబ్బల వెంకటరమణ. తల్లిదండ్రుల సహకారం, భర్త ప్రోత్సాహంతో అనేక ప్రాంతాలలో ఐసిడిఎస్ ఏ సి డి పి ఓ గా, సిడిపిఓ గా విశేష సేవలు అందించి అనేక అవార్డులు పొందారు. నేడు చింతపల్లిలో ఐసిడిఎస్ సిడిపిఓగా సేవలు అందిస్తున్నారు. ఈమె ప్రస్థానం చింతలపల్లి లో మొదలై నేటికీ చింతపల్లి లో కొనసాగుతుంది.

స్త్రీ అంటే శక్తి స్వరూపిణి

ఓర్పులో నేర్పులో తనకి తానే తాటి స్త్రీ

విశాలాంధ్ర – ఎటపాక: స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి తల్లిగా, భార్యగా, స్నేహితురాలిగా, అలా ఆమె పోషించే పాత్ర అనిర్వచ నీయం ఎక్కడైతే మహిళలు గౌరవిస్తారో ఆ సమాజం సమున్నతంగా ఉంటుంది. సమాజం బాగుంటేనే యావత్ ప్రపంచం పురోబివృద్ధి సాధిస్తుంది. నేడు పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారు. ఆర్మీ నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లోనూ వారి పాత్ర విశేషంగా ఉంటోంది. ఒక వైపు కుటుంభ భాద్యతలు మోస్తూనే.. మరో వైపు తాము పని చేస్తున్న రంగాలలో సత్తా చాటుతున్నారు. అయినప్పటి వారి పట్ల వివక్ష కొనసాగుతూనే వుంది. పనిచేసిన చోట తగిన గౌరవం లభించక సౌకర్యలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

మహిళపై వివక్ష ఉండకూడదు

సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్న మహిళ ల పై వివక్షత పోవడం లేదు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలు పెరిగి పోతున్నాయి. మహిళలపై చూపుతున్న వివక్ష వలన అనేకమంది వారి ప్రతిభను చూపలేక పోతున్నారు. విజయాలను సాధించేందుకు మహిళలకు పూర్తి స్థాయిలో సహకారం ఇవ్వాలి.

కందుకూరి శైలజ, ఉప సర్పంచ్, గన్నవరం, వేటపాక మండలం

చట్టాలు ఉన్న అమలు కావడం

మహిళ చట్టలున్నా వాటిని సారిగ్గా అమలు చేయడం లేదు. రోజు ఎదో ఒక మూలన మహిళలపై, బాలికలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు.

ఉబ్బ సుస్మిత, జెడ్పీటీసీ, ఎటపాక.

విద్యతోనే మహిళాభివృద్ధి

ఎన్నో ఏళ్లుగా మహిళ దినోత్సవం జరుపుకుంటున్నప్పటికి మహిళ ల చైతన్యం వ్యాపిస్తున్నప్పటికి మరో వైపుమహిళ ల ప్రగతిని చైతన్యాన్ని అణచి వేస్తున్నారు.అందుకు కారణం పురుషాధీకృత కుటుంబంలో పురుషుడి ఆధిపత్యం స్త్రీలు పురుషులకు లోబడి జీవించాలి. కుటుంబ భాద్యతలు ఆమెను అభివృద్ధి పథంలో సాగనివ్వవు. సంస్థలు తమపై స్థాయి ఉద్యోగులతో పాటు కింది స్థాయి ఉద్యోగులు కూడా మహిళలను వేధించడం, సాధించడం చూస్తుంటే పురుషాధికృత స్తాయి మనకు అర్ధమవుతుంది. ఈ పరిస్తితినుండి బయట పడాలంటే సౌకర్యాలను తెలుసుకోవాలి తెలుదుకోకపోవడంతో పాటు అదే అమలు లోకి వచ్చే విధంగా పరస్పర సహకారాన్ని అందించుకోవాలి . సమస్యలు గురించి ధైర్యంగా చెప్పుకో గలగాలి.



కాకా కామేశ్వరీ, ఎంపిపి, ఎటపాక

ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

మహిళలు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి.ఆత్మ విశ్వాసం ఉంటేనే పురుషులతో సమానంగా పనులు చేయ గలుగుతారు. మహిళలు గృహిణీ గా ఉంటూనే చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తు అభివృద్ధి చెందాలి.

టి. ఆదిలక్ష్మీ., ఏఎన్ఎం, గన్నవరం

మహిళ పాత్ర అపూర్వం

సమాజంలో అభివృద్ధిలో మహిళ ల పాత్ర ఎంతో కీలకం .కుటుంబంలో పిల్లల చదువులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అన్ని కుటుంబాలతో పిల్లలు విద్యా వంతులై మంచి స్థితి లో ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.

కాకా పుల్లమ్మ, ఉపాధ్యాయురాలు, చింతల చెరువు

స్త్రీ లేనిదే సృష్టే లేదు

భూదేవి అంత సహనం, రుద్రమ దేవి అంత పరాక్రమం, సీతా దేవి అంతా సౌశీల్యం ఉన్నా నేటి మేటి స్త్రీ.

కృష్ణవేణి, మహిళా పోలీసు గన్నవరం

ప్రతి మహిళ ఉన్నతి చదువులు చదవాలి

మహిళలందరూ అక్షరాస్యులు అయితేనే అభివృద్ధి సాధ్య మవుతుంది. విద్యతోనే మహిళలో చైతన్యం వస్తుంది. మరొకరి పై ఆధార పడకుండా ఉండేందుకు విద్య ఎంతగానో ఉపయోగ పడుతుంది.

టి.రాధ, అంగన్వాడీ సూపర్ వైజర్ ఎటపాక